ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

- పంట నష్టాన్ని క్షేత్రస్థాయికెళ్లి పరిశీలించాలి
- జిల్లా యంత్రాంగం కృషితో ముప్పు తప్పింది
- మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతుకు, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మొంథా తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన పంట పొలాలు, నష్ట ప్రభావిత ప్రాంతాలపై కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, నందికొట్కూరు శాసనసభ్యుడు గిత్తా జయసూర్యలతో కలిసి సంయుక్తంగా అధికారులతో సమీక్షించి అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాలను కచ్చితంగా లెక్కించి నివేదికలు సమర్పించాలని ఆదేశించామని పేర్కొన్నారు. వాగులు, వంకలు పొంగిన నేపథ్యంలో రివర్స్ స్ట్రాటజీ ద్వారా నీటిని మళ్లించడంతో నంద్యాలను పెద్ద ప్రమాదం నుంచి కాపాడగలిగామన్నారు. కలెక్టర్, అధికార యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారని మంత్రి ప్రశంసించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే అంచనా వేసి అధికారులు అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఈ సమయంలో జిల్లా యంత్రాంగం వ్యవహరించిన తీరు ఒక కేస్ స్టడీగా నిలిచిందని, దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా పంట నష్టం అంచనా వేయాలని, అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాల కారణంగా వెలుగోడు రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో నీటిని కుందూ నదికి విడుదల చేసినట్లు తెలిపారు. అయితే కుందూనదిలో నీరు పెరిగితే నంద్యాలకు ముప్పు ఉండే అవకాశమున్నందున కుందూనదిలోని నీటిని గాలేరు- నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు మళ్లించినట్లు తెలిపారు. ఈ చర్యలో జిల్లా మైనర్, మేజర్ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసినట్లు వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

పారదర్శకంగా విధులు నిర్వహించండి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అధికారులు తమ విధులను పారదర్శకంగా నిర్వహించి అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 2025 విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి చోటు చేసుకోకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్, ఏసీబీ అధికారులు కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రాభివృద్ధికి తోడ్పడండి

చైర్మన్ రమేష్‌నాయుడు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని కోరిన ట్రస్ట్ బోర్డ్



మాజీ ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు

శ్రీశైలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును శ్రీశైల దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు శనివారం కలిశారు. కడపలోని ఓ అతిథి గృహంలో ఆయనను కలిసి శ్రీశైలం ఆది దంపతుల ప్రసాదాన్ని అందజేశారు. శ్రీశైలంలో చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చి తోడ్పడాలని మాజీ ఉపరాష్ట్రపతిని కోరినట్లు చైర్మన్ తెలిపారు.

కళల ఖిల్లా కర్నూలు

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ఘనంగా ప్రారంభమైన 'కర్నూలు ఉత్సవ్-2025'



కర్నూలులో బీసీ రాజారెడ్డికి విశిష్ట సేవా పురస్కారం అందజేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, ఎంపీ నాగరాజు

6

పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలి

- అమరజీవికి ఘన నివాళి

బనగానపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును భావితరాలు సైతం స్మరించుకోవాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం పొట్టి శ్రీరాములు విగ్రహానికి బనగానపల్లెలో ఆర్యవైశ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోను పొట్టి శ్రీరాములు పాల్గొని జైలుకు కూడా వెళ్లారన్నారు. నిస్వార్థంగా ఆయన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పీఎస్ఎస్ నారాయణ, శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, టంగుటూరు శ్రీనయ్య, గుండా శ్రీనివాసులు, రామసుబ్బయ్య, డీ.వెంకటసుబ్బయ్య, గుండారవికుమార్, శివచంద్రయ్య, చిత్తలూరుప్రసాద్, గుండా సుప్రజ, గుండా మురళీధర్ పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు


ఎమ్మెల్యే బుడ్డాకు సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డు

- అభినందించిన సీఎం చంద్రబాబునాయుడు

ఆత్మకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి మొంథా ఫైటర్ అవార్డు వరించింది. శనివారం అమరావతిలోని ఉండవల్లిలో గల సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడు ఆయనకు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తుఫాను నేపథ్యంలో ఎమ్మెల్యే చేసిన కృషిని సీఎం అభినందించారు. గత నెల 28న మొంథా తుఫాన్ వల్ల శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. జనజీవనం అతలాకుతలమైంది. ఆత్మకూరుతో సహా అనేక గ్రామాల్లో భారీవర్షం కురియడంతో లోతట్టు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్న అన్నదాతలు కుదేలయ్యారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తుఫాన్ తగ్గుముఖం పట్టనప్పటికీ వరద ప్రభావిత గ్రామాలను ఆయనే స్వయంగా సందర్శించి వరద బాధితులను పరామర్శించి వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించారు. ఈయన చేసిన కృషిని గుర్తిస్తూ 'సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డు'ను సీఎం చంద్రబాబు అందజేశారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డును ఇవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే బుడ్డా




సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న అర్బన్ సీఐ రాము

అర్బన్ సీఐ రాముకు..

మొంథా తుఫాన్‌లో ఉత్తమ సేవలందించిన ఆత్మకూరు అర్బన్ సీఐ రాముకు శనివారం సీఎం చంద్రబాబు 'సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆయనకు అవార్డుపై ఎస్పీ సునీల్ షెరాన్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. రాయలసీమలోనే అవార్డు అందుకున్న ఏకైక పోలీసు అధికారిగా సీఐ రాము ప్రత్యేకతను సంపాదించుకున్నారు.

ఒక గేటు నుంచి నీరు విడుదల

శ్రీశైలం జలాశయంలో 212.43 టీఎంసీలు



గేటు నుంచి విడుదలవుతున్న వరద

శ్రీశైలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల జలాశయం ఒక క్రస్ట్ గేటు ఎత్తి కిందికి నీరు విడుదల చేస్తున్నారు. శనివారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 27,441 క్యూసెక్కులు, సుంకేశుల ద్వారా 13,338 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 78,660 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. జలాశయం ఒక క్రస్ట్ గేట్ పది అడుగుల ఎత్తు తెరిచి 27,800 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 26,956 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వారా 35,315, మొత్తంగా 90,071 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 884.40 అడుగులు, పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 212.43 టీఎంసీలుగా నమోదైంది.

కూలీపనులకు వెళ్తూ.. మృత్యు ఒడికి..

- ఆటోను ఢీకొట్టిన మినీ బస్సు
- ఇద్దరు కూలీలు దుర్మరణం
- మరో 12 మందికి గాయాలు
- కోటేకల్ గ్రామ సమీపంలో ఘటన

7

అల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంపును వ్యతిరేకించాలి







కాల్వబుగ్గలో కంచి పీఠాధిపతి


కాల్వబుగ్గ ఆలయంలోకి వస్తున్న కంచి పీఠాధిపతి

ఓర్వకల్లు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని కాల్వబుగ్గ ఆలయాన్ని కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర శంకరాచార్య స్వామిజీ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన పీఠాధిపతికి ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్, ఆలయ ప్రధానఅర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, ఈవోలు మద్దిలేటి, చంద్రశేఖర్‌రెడ్డి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగ తం పలికారు. ముందుగా పీఠాధిపతి చిన్నకోనేరులో స్నానం ఆచరించారు. కోనేరులోనే దాదాపు 3గంటల పాటు జపం చేసుకుని భక్తులచేత ఓం నమఃశివాయ నామాన్ని జపించారు. బుగ్గ రామేశ్వరుడికి రుద్రాభిషేకం, భ్రమ రాంబకు కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి రావడంతో ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి


ఆలయంలో ఎమ్మెల్యే గౌరు దంపతులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

● బుగ్గ రామేశ్వరుడికి ప్రత్యేక పూజలు

దంపతులు శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిజీని దర్శించుకుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన వేప చెట్టు కింద కూర్చుని పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు. పీఠాధిపతి మాట్లాడుతూ భక్తులందరూ భక్తి, సేవాభావంతో హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పిలుపునిచ్చారు. కంచి పీఠాధిపతి గోశాలలో ఉండగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి స్వామిజీ ఆశీస్సులు పొందారు. 1983లో భ్రమరాంబ, బుగ్గ రామేశ్వరస్వామిని దర్శించుకున్న 69వ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువు పూజశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామీజీ భ్రమరాంబ అమ్మ వారి గర్భాలయంలో శ్రీచక్ర యంత్రాన్ని ప్రతిష్టించారు. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర, తహసీల్దార్ విద్యాసాగర్, నాయకులు మోహన్ రెడ్డి, సుధాకర్‌రావు, నాగేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాల్వబుగ్గ ఆలయంలో ఎమ్మెల్యే గౌరు దంపతులను ఆశీర్వదిస్తున్న కంచి పీఠాధిపతి

అర్హులందరికీ పింఛన్ : కలెక్టర్ సిరి

●జిల్లాలో రూ.103.82 కోట్ల పంపిణీ


పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిరి, ఎంపీ నాగరాజు

కర్నూలు రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు కర్నూలు కలెక్టర్ ఏ. సిరి అన్నారు. జిల్లాల్లో నవంబరులో 2,37,904 మందికి రూ.103.82 కోట్ల పింఛన్ అందజేసినట్లు పేర్కొన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి కలెక్టర్ పాల్గొని అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పింఛన్ దారుల యోగ క్షేమాలను తెలుసుకొని, ప్రతి నెలా పింఛన్ అందుతోందా? అని అడిగారు. అర్హులందరికీ పంచన్ ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ప్రతి నెల 1వతేదిన అర్హులందరికీ పింఛన్ ఇస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి, రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నృత్యోత్సవం ప్రారంభం


అతిథులు, ఆలయ ప్రధాన అర్చకులతో కళాకారులు

ఆళ్లగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జాతీయ అంతర్జాతీయ స్థాయి నవనరసింహాల నృత్యోత్సవాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లెంశెట్టి సురేష్, అహోబిలం శ్రీకృష్ణ దేవరాయ బలిజ, కాపు, తెగల అన్నదాన సత్రం సంఘం అధ్యక్షుడు శెట్టి విజయ్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేశారు. లక్ష్మీనరసింహస్వామిని స్తుతిస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన కన్నుల పండుగగా సాగింది. ఈప్రదర్శనలో ప్రతిభ కనపరిచిన కళాకారులను అతిథులు, గురువులు జ్ఞాపికలతో సత్కరించారు. ఇంతటి గొప్ప కార్యాక్రమాన్ని నిర్వహించిన సురేష్‌ను ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి అభినందించారు. ఈ నృత్య ప్రదర్శన రెండు రోజల పాటు కొనసాగుతుందని ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లెంశెట్టి సురేష్ తెలిపారు. కథాకళి నాట్యగురువు రేణుక ప్రభాకర్, బాబు బాలాజీ, కమలా బాలాజీ, ఐశ్వర్యరెడ్డి, రామలలిత, వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.


అహోబిలం ప్రధాన అర్చక దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ సిరి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో 3 రోజుల పాటు 91 శాఖల అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రజాభిప్రాయ సేకరణ సానుకూలంగా ఉండేలా కృషి చేయాలన్నారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, సీపీవో భారతి, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

తుఫాన్ కంటే వేగంగా వెళ్లిపోయిన జగన్

● ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తగ్గాక ఏపీకి వచ్చిన వైఎస్ తుఫాన్ కంటే వేగంగా బెంగళూరులోని ప్యాలెస్‌కు వెళ్లిపోయాడని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ఎద్దేవా చేశారు. శనివారం కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఓ వైపు మొంథా తుఫాన్‌తో రాష్ట్రంలో హైటెన్షన్ వాతావరణం నెలకొని ఉంటే బెంగళూరుకు జగన్ వెళ్లిపోయాడన్నారు. తుఫాన్ తగ్గుముఖం పట్టాక ఏపీకి వచ్చి ప్రభుత్వంపై నాలుగు అర్థరహిత కామెంట్లు చేసి తుఫాన్ కంటే వేగంగా బెంగళూరుకు వెళ్లిపోయాడన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్ అండ్‌కోలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు వారం రోజుల పాటు మొంథా తుఫాన్‌పై రేయింబవళ్లు శ్రమిస్తే.. ఇప్పుడు వైసీపీ అధినేత వైఎస్ జగన్ దిగజారుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బ్రతికి ఉన్న రోజులు ప్రజల కోసం ఏమైనా చేయాలే కానీ ఇలా ప్రజాకంటకంగా ఎప్పుడూ మారకూడదని జగన్‌కు హితవు పలికారు. ఐదేళ్ల చంద్రబాబు నిర్మించిన సచివాలయంలోనే పాలన సాగించిన జగన్ ఒక్క భవనాన్ని అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. మళ్లీ చంద్రబాబు సీఎం హోదాలో వచ్చాక అమరావతితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భవనాలకు జీవం పోసినట్లయిందన్నారు. కర్నూలు బస్సు దహనం ఘటనలోనూ వైసీపీ బ్యాచ్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు క్షమించరానివన్నారు. చివరకు మేధావి వర్గానికి చెందిన జూపూడి ప్రభాకర్ కూడా జగన్‌కు భజన చేయడం సిగ్గుచేటన్నారు. సినీ రంగంలో మంచి భవిష్యత్తు ఉన్న యాంకర్ శ్యామల కూడా వైఎస్ జగన్ కోసం అవకాశాలను పోగొట్టుకుంటోందన్నారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత వైఎస్ జగన్, ఆ పార్టీ నేతలు ప్రభుత్వం చేస్తున్న మంచిని కూడా వక్రీకరించి, అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని గోపాలకృష్ణ హితవు పలికారు.

కళల ఖిల్లా కర్నూలు

● పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలి
● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
● ఘనంగా ప్రారంభమైన 'కర్నూలు ఉత్సవ్-2025'


ర్యాలీలో పాల్గొన్న కళాకారులు, విద్యార్థులు

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కళలు, సంప్రదాయాలు, జ్ఞాన సంపదకు పుట్టినిల్లు కర్నూలు జిల్లా అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. కర్నూలు జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేయాలని ఆయన జిల్లా ప్రజలు, మేధావులు, కళాకారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో వారం రోజుల పాటు జరిగే 'కర్నూలు ఉత్సవ్-2025' వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టీజీవీ కళాక్షేత్రం, ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా కర్నూలు కలెక్టరేట్ నుంచి వెయ్యిమంది కళాకారులు, విద్యార్థులు, మేధావులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట మహాత్మాగాంధీ, ఎన్టీఆర్, తెలుగుతల్లి విగ్రహాలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, డీఈఓ శామ్యూల్ పాల్, తెలంగాణ రాష్ట్ర విశ్రాంత డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య తదితరులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు రాత్రికి రాత్రి రాలేదని, అమర జీవి పొట్టి శ్రీరాముల ప్రాణత్యాగంతో వచ్చిందన్నారు. పొట్టి శ్రీరాములు ఆర్య వైశ్య సామాజిక వర్గానికి మాత్రమే పని చేయలేదని, ఆయన రాష్ట్రంకోసం, అన్ని సామాజిక వర్గాల కోసం, తెలుగు మాట్లాడే వారందరి కోసం ఆత్మార్పణ చేసుకున్నారన్నారు. అమర జీవి పొట్టి శ్రీరాములు స్మారకార్థం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం 50 అడుగులు విగ్రహంతోపాటూ మ్యూజియం ఏర్పాటు చేస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ రూ.కోటి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో వారం రోజులు జరిగే కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నగరంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేసి కళాకారులను ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు.


మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజీ వెంకటేశ్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్, డీఈఓ శ్యామ్యూల్‌పాల్, ఐపీఎస్ కొత్తకోట

మహనీయుల జిల్లా కర్నూలు : జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు జిల్లా చరిత్ర ఎంతో గొప్పది. ఎందరో మహనీయులు ఈ జిల్లా నుంచి ముఖ్యమంత్రులుగా, ప్రధానిగా, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులుగా సేవలందించారన్నారు. దేశస్వాతంత్ర్యంలోనూ జిల్లాకు చెందిన సమరయోధులు ప్రాణాలు అర్పించారన్నారు. ఇంతటి ఘన చరిత కలిగిన జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉంది. జిల్లా ఖ్యాతిని పెంచడంలో తాను ఒక భాగస్వామిగా ఉంటాను. కర్నూలు ఉత్సవ్ పేరిట కళాకారులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయం.

ఆకట్టుకున్న వేషధారణలు

కర్నూలు ఉత్సవ్-2025 ప్రారంభోత్సవంలో భాగంగా తొలిరోజున శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు ప్రారంభించిన ర్యాలీలో పలువురు కళాకారులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. గజల్ గాయకుడు మహ్మద్ మియా తెలుగు ఖ్యాతిని చాటి చెప్పే పాటలు ఆలపించారు. శ్రీకృష్ణ దేవరాయలుగా సంగా ఆంజనేయులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా డి.ఈశ్వరయ్య కట్ట బ్రహ్మన్నగా రాముడు, పొట్టి శ్రీరాములుగా ఎస్ఎండీ ఇనయతుల్లా ర్యాలీలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నేత పీబీవీ సుబ్బయ్య, రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, కళాక్షేత్రం ప్రతినిధులు సి.యాగంటీశ్వరప్ప, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాలవెంకటేశ్వర్లు, కదిరి రమేష్, ఎర్రమ పాండురంగయ్య, ఎన్‌డీ క్రిష్టఫర్, పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి, టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కళాకారులు



'నృత్య, నాటక కళాశాలను ఏర్పాటుకు కృషి'


విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకుంటున్న డీఈఓ శ్యామ్యుల్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐపీఎస్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో కళా ప్రదర్శనలకు నిలయంగా ఉన్న టీజీవీ కళాక్షేత్రంలో మరో నూతన భవనం నిర్మించి అందులో నృత్య, నాటక కళాశాలను ఏర్పాటు చేస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. 'కర్నూలు ఉత్సవ్-2025'లో భాగంగా శనివారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, డీఈఓ శామ్యూల్ పాల్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలో కళలు, కళాకారులకు కొదువ లేదని, ఆదరణ కోసం వారు వేచి చూస్తున్నారని అన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కళాకారులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం నిత్యం కళలను ఆదరిస్తూ, వేలాది మందికి ప్రోత్సాహకాలు కల్పిస్తోం దన్నారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ సంగీత, నృత్య నాటక అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తమ సంపూర్ణ సహకారం అందజేస్తామని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు ఉత్సవ్-2025 భావి తరాలు గుర్తుంచు కునేలా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 7 వరకు నిత్యం ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు కళాక్షేత్రంలో ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఆర్‌కే శర్మ, టీజీవీ కళాక్షేత్రం ప్రతినిధులు మహమ్మద్ మియా, ఇనాయతుల్లా, యాగంటీశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, కేవీ రెడ్డి, పీపీ గురుమూర్తి, బాలవెంకటేశ్వర్లు, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

● **విశిష్ట సేవకులకు సత్కారం:** కర్నూలు ఉత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, పత్తి ఓబులయ్య ఘనంగా సత్కరించారు. బీసీ రాజారెడ్డి (సామాజిక సేవ, బనగానపల్లె), కొత్తకోట శ్రీనివాసరెడ్డి (విశ్రాంత డీజీపీ, తెలంగాణ), డీఈవో శామ్యూల్ పాల్, రామకృష్ణారెడ్డి (రామకృష్ణ విద్యాసంస్థల అధినేత, నంద్యాల), ఎం.అరుణాచలం రెడ్డి (ప్రతిభ విద్యాసంస్థల అధినేత, కర్నూలు), గండ్లూరి దత్తాత్రేయ శర్మ (శతావధాని), కేసీ కల్కూర (సామాజిక సేవకులు), ఎ. రజనీబాయి (సీనియర్ రంగస్థల నటీమణి)లు సత్కారాలు అందుకున్నారు.

బీసీ స్ఫూర్తి.. తీరిన దాహార్తి

● కార్తీక మాసంలో వేలాదిగా భక్తులు
● బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆర్వో ప్లాంట్లు


నల్లమలలోని బీసీ రాజారెడ్డి ఉచిత వాటర్‌ప్లాంట్ ఆవరణలో సేదతీరుతున్న భక్తులు

మహానంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీక్షేత్రంలో విలువైన వృక్ష సంపద, జంతువులకు ఆలవాలమే కాదు... శ్రీశైల మల్లన్న, మహానంది మహానందీశ్వరస్వామి క్షేత్రాలతో పాటు ఎన్నో ప్రముఖ శైవాలయాలను దర్శించుకోవాలంటే నల్లమల నుంచి తప్పకుండా వెళ్లాల్సిందే. దుర్భేధ్యమైన అడవుల్లో సాగే ఈ ప్రాంతంలో దాహార్తికి మాత్రం ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడేవారు. వారి సమస్యను గుర్తించిన బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి నల్లమలలో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ క్రమంలో మహానంది మండలం దట్టమైన అటవీ ప్రాంతంలోని నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారి ప్రక్కన రూ.45 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అటు వైపుగా వెళ్లే వాహనదారులతో పాటు దైవదర్శనం మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు అదే మార్గంలోని సర్వ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే వేలమంది భక్తులకు ఈ తాగునీటి కేంద్రం దాహాన్ని తీర్చుతోంది. రాత్రి వేళల్లో నల్లమల ఘాట్‌లో వెళ్ళే భక్తులతో పాటు వాహనదారులు బీసీ రాజారెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ పరిసరాల్లో కాసేపు సేదతీరి విశ్రాంతి తీసుకుని వెళ్తున్నారు.

దాహార్తి తీర్చాలనే



నల్లమల రహదారిలో వెళ్ళే వాహనదారులతో పాటు అటువైపుగా మహానంది, సర్వనరసింహ స్వామి ఆలయాలకు దర్శనం కోసం వెళ్ళే భక్తుల నీటి దాహార్తి తీర్చాలన్న ఆశయంతో రూ.45 లక్షలతో మహానంది మండలం గాజులపల్లి సమీపంలోని ప్రధాన రహదారి ప్రక్కన పొలం కొనుగోలు చేసి ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసాను. ఇది అటు వైపు వెళ్ళే ప్రయాణికులతో పాటు దినసరి కూలీలకు, భక్తులకు ఉపయోగపడుతోంది. దీంతో రాత్రి వేళల్లో ఎంతో మంది సేదతీరి వెళ్లేందుకు ఉపయోగపడటం సంతోషాన్ని ఇస్తోంది. - దాత బీసీ రాజారెడ్డి



గాజులపల్లిలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రం

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.15 లక్షల ఆస్తి నష్టం



బీరువాలో కాలిపోయిన దుస్తులు, నగదు

ఆదోని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. పట్టణంలోని బండిమిట్ట ప్రాంతంలో శనివారం ఉదయం ఈఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బండిమిట్టలో నివాసం ఉండే వీరేష్, చిట్టెమ్మ దంపతులు పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇంట్లో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. చుట్టుపక్కల వాళ్లు గమనించి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చేలోగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని నగలు, డబ్బు, దుస్తులు, తిండిగింజలు, వస్తువులు దగ్ధమై బూడిదయ్యాయి. రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తమది పేద కుటుంబమని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు నాయకులను వేడుకున్నారు.

గడ్డివాములు దగ్ధం



గొల్లలదొడ్డిలో కాలిపోతున్న గడ్డివాములు

సి.బెళగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. బాధిత రైతు కరువ సోమన్న కథనం మేరకు.. పశువుల మేత కోసం వెరుశనగ, కొర్ర, వరి, జొన్నతో గడ్డివాలు ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కోడుమూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే మొత్తం కాలిపోయింది. రూ1.5లక్ష నష్టం వచ్చిందని ఆదుకోవాలని బాధితుడు కోరారు. స్థానికంగా ఫైర్ ఇంజన్ ఉంటే ఇలా అయ్యేది కాదని ఉన్నతాధికారులు స్పందించి గూడూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్యాపిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమాను మిట్ట దగ్గర శనివారం విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందినట్లు జలదుర్గం ఎస్ఐ నాగార్జున తెలిపారు. వివరాలు.. డోన్ మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన నీలప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మంజునాథ్(17) చిగురుమాను మిట్ట దగ్గర చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. కోడిని ఈకలను తొలగించే మిషన్ వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో కి వెళ్లగా చికిత్స నిమిత్తం డోన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

ఆళ్లగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంట గ్రామం ప్రతాపరెడ్డి కాలనీలో కుక్కల దాడిలో శనివారం ముగ్గురికి గాయాలయ్యాయి. వసుంధర, యశ్వంత్, మరో చిన్నారి గాయపడగా వీరిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గతంలో కూడా కుక్కల దాడిలో చాలామంది గాయాల పాలైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులను చూపుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి సమీపంలో అక్టోబరు 28న జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ చెప్పారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం పి. కోటకొండకి చెందిన దస్తగిరి ఆచారికి, చెల్లెలచెలిమకి చెందిన వరలక్ష్మితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. పెళ్లి అయినప్పటి నుంచి కాపురంలో కలహాలు జరిగేవి. దస్తగిరి ఆచారి నిత్యం భార్యపై అనుమానం వ్యక్తం చేసేవారు. పెద్దల సమక్షంలో పంచాయితీ, దేవనకొండ పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. రెండేళ్ల క్రితం ఇరువురు విడిపోయారు. వరలక్ష్మి కర్నూలు సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తుంది. పిల్లల కోసం కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇద్దరిలో ఎలాంటి మార్పు రాలేదు. చివరకు భర్తను హత్య చేయాలని భార్య నిర్ణయించుకుంది. హత్యకు తన సోదరులైన శేఖర్, వీరేశ్‌తో కలిసి కుట్ర పన్నింది. అక్టోబరు 28న పి.కోటకొండకు వెళ్లాలని ఒక ఆటోలో దస్తగిరి ఆచారి, వరలక్ష్మి, శేఖర్, వీరేశ్ కలిసి బయలుదేరారు. ప్యాలకుర్తి గ్రామం సమీపంలో తాగిన మైకంలో ఉన్న దస్తగిరి ఆచారి గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. పత్తికొండ రహదారిలోని పెట్రోల్‌బంకు దగ్గర అనుమానంగా ఒక ఆటోలో ముగ్గురు నిందితులు తిరుగుతుండగా పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ డివై స్వామి, ట్రైనింగ్ ఎస్ఐ మణికంఠ, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంపును వ్యతిరేకించాలి



- రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి ప్రాజెక్టుపై కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలుగు రాష్ట్రాల పాలిట మరణశాసనం అయ్యేలా ఉందని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నంద్యాలకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆల్మట్టి ఆనకట్టు ఎత్తును పెంచాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అదే కనుక జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇక్కట్లకు గురికాక తప్పదన్నారు. ఆల్మట్టి ఆనకట్టు ఎత్తు పంపు నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు వ్యతిరేకించడంతో పాటు అడ్డుకోవాలన్నారు. ఆ మేరకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆనకట్ట ఎత్తు పెంచితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర రైతులు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆయకట్టుదారులు తమ పంటలకు అవసరమైన నీరు అందకపోవడం వల్ల నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు ఆల్మట్టి ఆనకట్ట పెంపు నిర్ణయాన్ని మానుకోవాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు కుంచం వెంకటసుబ్బారెడ్డి లేఖను పంపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, దేవేంద్ర ఫడ్నవీస్‌లకు ఆయన లేఖలు పంపారు. ఆల్మట్టి ఎత్తు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆల్మట్టి ఎదుట ప్రాణత్యాగానికి సిద్ధమని కుంచం స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ మేరకు నీటి వాటాలు పక్కాగా జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ట్రిబ్యునల్ జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కూలీ పనులకు వెళ్తూ.. మృత్యు ఒడికి..



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలు రంగవేణి తల్లి, బంధువులు

- ఆటోను ఢీకొట్టిన మినీ బస్సు
- ఇద్దరు కూలీలు దుర్మరణం
- 12 మందికి గాయాలు
- వీరిలో నలుగురి పరిస్థితి విషమం
- కోటేకల్ గ్రామ సమీపంలో ఘటన



బోయ రంగవేణి(ఫైల్)



గొల్ల నాగలక్ష్మి (ఫైల్)

ఎమ్మిగనూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పత్తి కోత పనులకు వెళ్తూ.. ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. మరో 12మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం ఉదయం ఎమ్మిగనూరు మండలంలోని కోటేకల్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన డ్రైవర్ కన్నయ్యతో పాటు 13మంది వ్యవసాయ కూలీలు చాకలి వెంకటేశ్వరి, చాకలి శిరీష, బోయ గుండమ్మ, బోయ శాంతి, గొల్ల కవిత, బోయ అనుసూయ, చాకలి నాగలక్ష్మి, బోయ అంజలి, బోయ కొండ నరసమ్మ, బోయ రంగవేణి, సాయి చరణ్, చాకలి మహాదేవి ఆటోలో పత్తికోత పనుల కోసం మంత్రాలయం మండలం కలుదేవకుంట గ్రామానికి బయలుదేరారు. ఆటో కోటేకల్లు గ్రామ సమీపంలో 167 జాతీయ రహదారి టర్నింగ్‌లో వస్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా వస్తున్న మినీబస్సు ఆటోను ఢీకొట్టింది. ఆవేగానికి ఆటో ఎగిరి మూడు పల్టీలు కొట్టింది. అందులోఉన్న కూలీలు ఒక్కసారిగా చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో కూలీలకు రక్తగాయాలయ్యాయి. ఒక్కసారిగా ఆటో ప్రమాదానికి గురికావడం, అందులో ప్రయాణిస్తున్న కూలీలు చెల్లాచెదురుగా పడి రక్తగాయాలు కావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఆప్రాంతం క్షతగాత్రుల ఆర్తనాదాలతో మిన్నంటింది. గాయాలపాలైన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అక్కడికక్కడే మృతిచెందగా..

రోడ్డు ప్రమాదంలో ఆదోని మండలం కపటికి చెందిన బోయ రంగవేణి(16) అక్కడిక్కడే మృతి చెందింది. గొల్ల నాగలక్ష్మి అలియాస్ సరస్వతి (28)తో పాటు మరో నలుగురికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తరలించారు. నాగలక్ష్మి చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగలక్ష్మికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిన్నంటిన రోదనలు

ఉదయాన్నే కూలీ పనుల కోసమని మంత్రాలయం మండలం కలుకుంట గ్రామానికి బయలుదేరిన కూలీలకు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలియగానే ఆదోని మండలం కపటి గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆటోలో 14మంది ఉండడంతో ఎవరెవరికి ఏమైందోనని ఆయా కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. రోడ్డు ప్రమాదంలో రంగవేణితో పాటు నాగలక్ష్మి మృతి చెందడం, మిగతా వారికి తీవ్ర రక్తగాయాలు కావడంతో వారివారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలివచ్చారు. మృతుల, క్షతగాత్రుల బంధువుల రోదనలతో మిన్నంటింది. ఇద్దరు కూలీలు మరణించడంతో కపటి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

టెంపో ఢీ.. వాహనదారుడి మృతి

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను టెంపో ఢీకొట్టగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రచ్చుమర్రి సమీపంలో శనివారం చోటుచేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటకలోని రాయచూరు తాలుకా గట్టుబిచ్చాల గ్రామానికి చెందిన భీమారావు(45) బైక్‌పై పెద్దకడుబూరు మండలం ముచ్చగిరికి వెళ్తున్నాడు. బెంగుళూరు నుంచి మంత్రాలయం వస్తున్న విభిన్న ప్రతిభావంతులను తీసుకువస్తున్న టెంపో బైక్‌ను ఢీకొట్టింది. భీమారావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మాధవరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. భార్య అంబిక, కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా వ్యక్తి..

క్రిష్ణగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెంపాడు గ్రామానికి చెందిన రేమట సోమేశ్వరరెడ్డి (49) ఆటో బోల్తా పడడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. వెల్దుర్తి నుంచి గూడెంపాడు గ్రామానికి పుట్లూరు గ్రామానికి చెందిన ఉప్పరి వెంకట ప్రతాప్ ఆటోలో శుక్రవారం సాయంత్రం బయలుదేరారు. గూడెంపాడు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను అతివేగంతో ట్రాక్టర్ ట్రిల్లర్‌కు తగిలించడంతో ఆటో బోల్తా పడి సోమేశ్వరరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. భార్య సోమేశ్వరమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వెల్దుర్తిలో ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలుకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు రేమట కృష్ణారెడ్డి పిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ కృష్ణమూర్తి శనివారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- అదుపు తప్పి బోల్తాపడ్డ బొలెరో



నల్లమలలో బోల్తా పడ్డ బొలెరో వాహనం

మహానంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డ ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. మరో పది మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో గిద్దలూరు-నంద్యాల ప్రధాన రహదారిలో శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న బొలెరో దాదా ఖలందర్‌దర్గా వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మండలంలోని గాజులపల్లికి చెందిన అబ్దుల్ మజీద్(50) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 10మందికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తి రైతులకు నష్టం రాకూడదు

- మద్దతు ధర కల్పించండి : కలెక్టర్ ఏ.సిరి



మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కర్నూలు (గ్రికల్చర్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు నష్టపోకుండా మద్దతు ధర కల్పించాలని కలెక్టర్ ఏ.సిరి జిన్నింగ్ మిల్లు ప్రతినిధులు, సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జేసీ నూరుల్ ఖమర్‌తో కలిసి జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పత్తిని బాగా ఆరబెట్టి తీసుకుని వెళితే మంచి ధర వస్తుందని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి కొనుగోలు చేయాలన్నారు. పత్తిని కొనుగోలు చేసిన తర్వాత వెంటనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. జేసీ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ పత్తిని కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రారంభమైన రోజు నుంచి 188 గ్రామాల్లో కొనుగోళ్ల ప్రక్రియ మొదలైందన్నారు. శనివారం నాటికి 139 రైతుల నుంచి 3,012 క్వింటాళ్ల పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేశారన్నారు. మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, సీసీఐ అధికారులు, మార్కెట్ యార్డు సెక్రటరీలు సుందర్ రాజు, చంద్రమౌళి, గోవిందు, కార్నలిస్, సునీత ఉన్నారు.

రాముడి కృపతో దేశం సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- వైభవంగా శ్రీరాముని విగ్రహావిష్కరణ



శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్, టీజీ భరత్

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాములోరి కృపతో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం పాతనగరంలోని మెయిన్‌బజార్‌లో గల అతిపురాతన పేట రామాలయంలో జరిగిన శతాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన ద్వారంపై 13 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ప్రధానఅర్చకుడు మాళిగి హనుమేశాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిల్కూరు నందకిషోర్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ గర్భగుడిలోని ఏకాంత రాముడ్ని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్‌లు దర్శించుకొని పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురంపై నెలకొల్పిన 13అడుగుల శ్రీరాముని విగ్రహానికి పూజలు చేసి ఆవిష్కరించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలులో అతి ప్రాచీనమైన పేట రామాలయం అభివృద్ధికి అన్ని విధాలా సంపూర్ణ సహకరిస్తామన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, కరివేన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, క్రెడాయ్ కర్నూలు చైర్మన్ గోరంట్ల రమణ, వీహెచ్‌పీ నాయకులు మాళిగి భానుప్రకాశ్, సత్యప్రియ, డి. రాంప్రసాద్ పాల్గొన్నారు.

పౌరులు బాధ్యతగా మెలగాలి



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

కర్నూలు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పౌరులంతా బాధ్యతగా మెలిగినప్పుడే ఆదర్శమైన సమాజం ఏర్పడుతుందని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ డి.సోమన్న అన్నారు. శనివారం ఉస్మానియా కళాశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ అధ్యక్షతన విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

అనుకూలమైతే అక్కడే..!



- ఏళ్ల తరబడి ఒకేచోట కొందరు నర్సులు
- పెద్దాసుపత్రి స్టాఫ్ నర్సుల డ్యూటీ రోస్టర్‌పై విమర్శలు
- స్థానాలు మార్చాలని ఇటీవలే డీఎంఈ ఆదేశించినా అమలు కాని వైనం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సింగ్ సిబ్బంది విధులకు సంబంధించిన డ్యూటీ రోస్టర్ గందరగోళంగా మారింది. 1,200 పడకలున్న ఆసుపత్రిలో 600 మంది రెగ్యులర్ హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. డ్యూటీ రోస్టర్‌లో గతంలో ఎప్పుడూ లేనంతగా రాజకీయ జోక్యం పెరిగినట్లు విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నేతల సిఫారసులతో మళ్లీ ఉన్న చోటే డ్యూటీ వేయించుకోవడం పరిపాటిగా మారింది. నాలుగు నెలలుగా డ్యూటీ రోస్టర్‌లో రాజకీయ నాయకుల జోక్యం పెరిగినట్లు నర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. శనివారం విడుదల చేసిన డ్యూటీ రోస్టర్‌లో యురాలజీ, నెఫ్రాలజీ కార్డియాలజీ, సిటీవీఎస్ విభాగాల్లో విధులు నిర్వరిస్తున్నవారినే అలాగే కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. యురాలజీ విభాగంలో ఏకంగా ముగ్గురు కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు తిరిగి అక్కడే డ్యూటీ వేశారు. ఇక కార్డియాలజీ విభాగంలో కూడా కొందరు కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాతుకుపోయారు. ఇదే విభాగంలో ఓ కాంట్రాక్టు మేల్ స్టాఫ్ నర్సు ఏళ్ల తరబడి అక్కడే పని చేస్తుండటం అధికారులకు కనబడటం లేదా అని కొందరు నర్సింగ్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. లాంగ్ స్టాండింగ్‌లో పనిచేస్తున్న నర్సుల స్థానాలను మార్చాలని ఇటీవల డీఎంఈ ఆదేశించినా అమలు కావడం లేదన్న విమర్శలు వస్తున్నారు. ఆసుపత్రి అధికారులకు అనుకూలంగా ఉంటే రోగులు తక్కువగా ఉండే వార్డులు, ఇతరులకు రోగులు ఎక్కువగా ఉండే వార్డుల్లో డ్యూటీ వేస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. కొద్ది రోజుల్లో స్టాఫ్‌నర్సులకు పదోన్నతులు వచ్చే అవకాశముంది. కాగా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల ను బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నర్సింగ్ సిబ్బంది అందరికీ అన్ని చోట్ల డ్యూటీలు వేయాలన్న చర్చ జరుగుతుంది.

గత నెలలో ఓ కాంట్రాక్టు స్టాఫ్ నర్సుకు క్యాజువాల్టీలో డ్యూటీ వేయగా పది రోజులు విధులు నిర్వహిచార ఓ మంత్రి సహాయకుడి జోక్యంతో ఆ నర్సును మళ్లీ యధాస్థానానికి పంపినట్లు తెలసింది.

- ఈ విషయమై సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ప్రతి ఒక్కరూ అన్నిచోట్ల పని చేసేలా రోస్టర్ వేయాలని నర్సెస్ అసోసియేషన్ నాయకులు విన్నవించారని, దీని ప్రకారమే డ్యూటీ రోస్టర్‌ను సమూలంగా మార్పు చేశామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



మండ్లెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని మండ్లెం గ్రామంలో పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ నాగేంద్ర, పీఆర్‌ఏఈ బషీర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, గిరీశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో టీడీపీ కార్యకర్త కసన్‌నాయక్ బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గ్రామానికి వెళ్లి కసన్ నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెల్లె హరినాథరెడ్డి, శివశంకరస్వామి పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే ముఖ్యం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ మందాజావలి

నంద్యాల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమమే ముఖ్యమని ఏఎస్పీ మందాజావలి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ శాంతిరాం హాస్పిటల్ సౌజన్యంతో సుమారు 147మంది పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని నంద్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. పోలీసులు చాలా మంది రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు జీవన గంగనాథ్‌బాబు, ఈశ్వరయ్య, కృష్ణయ్య, పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

కొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆర్యవైశ్య అన్నదాన సత్ర ప్రాంగణంలో కాకనూరు శారదమఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామిజీ పర్యవేక్షణలో అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సేగు కిరణ్ కుమార్, దొంతు నరేష్, గోళ్ల సత్యనారాయణ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. అలాగే కలశ గణపతి పూజ, మహారుద్రాభిషేకం, నవగ్రహ పూజ తదితర విశేష పూజలు చేశారు. వ్రతంలో 75 జంటలు పాల్గొన్నాయి. అనంతరం కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్యులు కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సత్రం ప్రెసిడెంట్ నాగ సత్యనారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలి

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్
- అట్టహాసంగా డివిజన్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న వక్తలు

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే చక్కటి విజయాలను సాధించవచ్చునని టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆత్మకూరు డివిజన్ స్థాయిలో అండర్-14, 17 విభాగాల్లో క్రీడాపోటీలను ఎంఈవోలు అయూబ్, నాగరాజు, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, షహబుద్దీన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. కాగా డివిజన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవానంద్, పాఠశాల కమిటీ చైర్మన్ శివకుమార్, టీడీపీ నాయకులు కలిముల్లా, నాగూర్, తిమోతి, పీఈటీలు పాల్గొన్నారు.



గంగాధర మండపం వద్ద కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు



కళారాధనలో సాంప్రదాయ నృత్యం చేస్తున్న కళాకారులు

ఆదిదంపతులకు కళా నీరాజనాలు

శ్రీశైలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో కార్తీక సంబరాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి.

ఆలయ ప్రధాన గోపురం వద్ద యాత్రికులు కార్తీక దీపాలు వెలిగించి దీపదానాలు చేశారు. ప్రదోషకాలంలో స్వామి, అమ్మవార్ల ఎదుట దీపాలు వెలిగించుకుంటే సకల శుభాలు కలుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు విజయకుమార్ తెలిపారు. కళారాధనలో కళాకారులు సాంప్రదాయ నృత్య ప్రదర్శన ఇచ్చారు. భక్తులను మంత్రముగ్ధులయ్యారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్ బాబు, తాలూకా కార్యదర్శి ప్రతాప్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు రైతు సంఘం నాయకులతో కలిసి బాపనంతాపురం గ్రామంలో తడిసిన మొక్కజొన్నను పరిశీలించారు. తక్షణమే కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 2500 చొప్పున మద్దతు ధర ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు నమూనా ఎన్నికలు

పాణ్యం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించినట్లు హెచ్‌ఎం రాములు నాయక్ తెలిపారు. ఏ సిటీజన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఇమామ్‌బాషా 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఒక్కో తరగతి నుంచి ఒక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా జీవనానికి ఇబ్బందులు ఉండొద్దు



గ్రామంలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో గ్రామాల్లో ప్రజా జీవనానికి ఇబ్బందులు లేకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచించారు. శనివారం మండలంలోని కానాల గ్రామంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబుతో కలిసి పర్యటించారు. తుఫాను వల్ల ప్రజలకు కలిగిన నష్టాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తక్షణమే పారిశుధ్య పనులు, ప్రజారోగ్య రక్షణకు మెరుగైన చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యాలపై అవగాహన

పాణ్యం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల మార్గదర్శకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. శనివారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఉన్నత విద్యా మండలి గుర్తించిన పాఠశాలల ఉపాధ్యాయులకు వికసిత్ భారత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల ప్రొఫెసర్ పీవీ గోపికృష్ణారావు, హెచ్‌వోడీలు సోఫియా ప్రియదర్శిని, కిశోర్, శాంతల, జిల్లా సైన్స్ అధికారి సుందర్, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐటీయూ సభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యేసురత్నం

నందికొట్కూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బేతంచర్లలో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ 3వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు యేసురత్నం కోరారు. శనివారం స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, నాయకులు ఉస్మాన్ బాషా, నజీర్నిసా, బసవరాజు, నాగన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. శనివారం శివపురం గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో మొక్కజొన్న, మినుము, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

4న మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 4న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మేరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ కిచ్చెనగారి కుములత అధ్యక్షత వహిస్తారన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలన్నారు. అలాగే ఆయా శాఖల మండల అధికారులు నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

పూడికతీత పనులు చేపట్టాలి

ఆత్మకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణం మీదుగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మవాగులో పూడిక తీత పనులను చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు శివకుమార్, నాగేశ్వరరావు, కిరణ్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రేపు కార్తీక వనభోజనాలు

ఆత్మకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వరుడి ఆలయంలో సోమవారం కార్తీక మాసోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి శనివారం తెలిపారు. అనంతరం సామూహిక కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

టైరు పగిలి ఆటో బోల్తా

జూపాడుబంగ్లా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు టైర్ పగలడంతో ఆటో బోల్తా పడింది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. కరీముల్లా అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పొదుపు నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన గోల్‌మాల్‌పై 'రూ.2.72 కోట్లు గోల్‌మాల్' అనే శీర్షికతో గత నెల 28న కథనం ప్రచురితమైంది. కలెక్టరు రాజకుమారి ఆరా తీశారు. విచారించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

గిరిజనుల సంక్షేమానికి కృషి

ఆళ్లగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి తమ వంతుగా కృషి చేస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ శివప్రసాద్ అన్నారు. శనివారం అహోబిలం కొత్తకోట్టాల, బండ్లగడ్డ చెంగు గూడాలను ఆయన సందర్శించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం పై చెంచులకు అవగాహన కల్పించారు. చెంచుల సమస్యలను వారిని అడిగి తెసుకొని వారు ఇచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం చెంచులు అడవిలో దొరికే కర్రలతో చేసి వివిధ కళారూపాలను ఆయన పరిశీలించారు. ముందుగా అహోబిలం లోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెరుకొన్న ప్రాజెక్టు అఫీసర్ కు చెంచులు మేళతాళాలు, నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

అవుకు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం అవుకు రిజర్వాయర్ వద్ద మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని అన్నారు. చేపల వేటకు అవసరమైన వలలు, బోట్లు సబ్సిడీపై అందిస్తామన్నారు. మత్స్యకార సంఘం నాయకులు బొజ్జలయ్య, చిలకన్న, రమేష్, రమణ, సుబ్బరాయుడు, రాజ, వెంకటేశ్వర్లు, రాముడు, శీను, రామయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

గౌడ కులస్థుల సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని గౌడసంఘాల నాయకులు కోరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

బేతంచెర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాదులో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీకి నాయకులు తరలివెళ్లారు. విజయవంత చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్ మాదిగ శనివారం పిలుపునిచ్చారు. మండలం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షుడు మజిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు మహేష్, రాజు, మధు, చిన్న తిమ్మయ్య, లాజర్, కిరణ్, ప్రదీప్, ఎల్లమ్మ, ప్రదీప్, సూరి పుల్లయ్య, కుమార్, మనోజ్, నితీన్, రంగ తదితరులు పాల్గొన్నారు.

'మన దేశాన్ని గౌరవించుకుందాం'

డోన్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మన దేశంలో తయారైన వస్తువులను ప్రోత్సహిస్తూ గౌరవించుకుందామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ అన్నారు. శనివారం ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రతి ఇంటా స్వదేశీ అనే నినాదంతో పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్ ఆధ్వర్యంలో మాకాం వీధిలోని పాతబస్టాండు, షాపులకు, మల్యాల, తాడూరు గ్రామ వినియోగదరులకు స్వదేశం పోస్టు గురించి అవగాహన కల్పించారు.

జనసేన నాయకుడి మృతికి సంతాపం

ఆళ్లగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యోజునాథపురంలో జనసేన నాయకుడు మాచర్ల నాగన్న మృతి చెందారు. దీంతో జనసేన నాయకుడు ఇరిగెల సూర్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇరిగెల మాట్లాడుతూ పార్టీ, తమ కుటుంబం అండగా ఉంటుందని అన్నారు.



నివాళులర్పిస్తున్న ఇరిగెల సూర్య నారాయణరెడ్డి

ట్రావెల్స్‌పై కొరడా

- ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు ఆర్టీవో అధికారుల జరిమానాలు
- ఐదు నెలల్లో ఫైన్ల రూపంలో రూ.25.89 లక్షల వసూలు

డోన్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీవో అధికారులు కొరడా ఝుళిపించారు. డోన్ హైవేపై నిబంధనలు ఉల్లంఘిస్తూ తిరుగుతున్న ట్రావెల్స్ బస్సులకు భారీ జరిమానాలు విధించారు. ఐదు నెలల్లో ఏడు ట్రావెల్స్ బస్సుల నుంచి ఫైన్ల రూపంలో రూ.25.89 లక్షలు వసూలు చేశారు. ఈ సంవత్సరం జూన్ నెలలో 5వ తేదీన ఒక ట్రావెల్ బస్సుకు రూ.3.60 లక్షలు, జూలై 1న మరో ట్రావెల్ బస్సుకు రూ.4.19లక్షలు జరిమానా వేశారు. సెప్టెంబరు 21న నిబంధనలు ఉల్లంఘించిన ఒక ట్రావెల్ బస్సుకు రూ.3.73లక్షలు అదే నెల 26న ఇంకో బస్సుకు రూ.4.19లక్షలు, అదే నెల 26న తప్పుడు నెంబర్ ప్లేట్, తప్పుడు రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న ఓ ట్రావెల్ బస్సుకు రూ.4.50 లక్షలు, అదే నెల 19న ఓ ట్రావెల్ బస్సుకు రూ.4.43 లక్షలు ఫైన్లు విధించారు. అక్టోబరు 7న అక్రమంగా నడుస్తున్న ఓ ట్రావెల్ బస్సుకు భారీ జరిమానాలు విధించినట్లు డోన్ ఆర్టీవో క్రాంతికుమార్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇటీవల చిన్నటేకూరు వద్ద జాతీయ రహదారిపై నిబంధనలు ఉల్లంఘించి తిరుగు తున్న కావేరి ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురి కావడం విదితమే. గతంలోనే ట్రావెల్ బస్సుల కట్టడికి డోన్ ఆర్టీవో అధికారులు కృషి చేస్తున్నారు.



హైవే పై ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్ (ఫైల్)

కఠిన చర్యలు తప్పవు



జాతీయ రహదారిపై నిబంధనలు అతిక్రమించి ట్రావెల్స్ బస్సులు నడిపితే కఠిన చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానాలు విధిస్తాం. అక్రమంగా రోడ్లపై వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటాం.

- క్రాంతి కుమార్, ఆర్టీవో, డోన్

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

బేతంచెర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రం ప్రత్యేక ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టి తెలుగు రాష్ట్రం ఏర్పాటు కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని వాసవి క్లబ్ అధ్యక్షులు సుధీర్ అన్నారు. శనివారం పట్టణంలో అమ్మవారిశాలలో తెలుగు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు రామ్మూర్తి, కందగడ్డల జనార్దన్, సురేష్ పాల్గొన్నారు.



శిరివెళ్ల డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

శిరివెళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి శనివారం నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ జనార్దనుడు, అధ్యాపకులు కృష్ణమూర్తి, ఖాశీం సాహెబ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల పాదయాత్రకు సంఘీభావం

డోన్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డోన్ నుంచి విజయవాడ సీఎం ఆఫీస్ వరకు ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యల పరిష్కార చైతన్య పాదయాత్రను శనివారం ప్రారంభించారు. డోన్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి సంఘీభావం తెలిపారు.

అవుకు పట్టణాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా : మంత్రి బీసీ

అవుకు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం టీడీపీ సీనియర్ నాయకులు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డితో కలిసి పట్టణంలోని తేరు వీధిలో అండర్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. మార్కెట్‌లో గతంలో నిలచిపోయిన కట్టడాలను పూర్తి చేసి మరింత అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ దశాబ్దాలుగా అవుకు నిర్లక్ష్యానికి గురైందన్నారు. మండల వ్యాప్తంగా రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ. 5 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణనాయక్, మద్దిలేటిగౌడు, అరుణ్‌కుమార్‌నాయక్, తిక్కన్న, మొట్ల రామిరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పుల్లారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, వల్లపు శేఖర్‌రెడ్డి, చిలకల రామచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ రెడ్డి గోవిందు, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



అండర్ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి

'సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం'

కోవెలకుంట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంతపేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి బీసీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో సీసీ రోడ్లు, మౌలిక వసతులు కల్పించి దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. అంతకు ముందు సంతపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు కోవెలకుంట్లను డోన్ డివిజన్‌లో కాకుండా నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో కలపాలని మంత్రి బీసీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్ గువ్వలసుబ్బారెడ్డి, సౌదరిదిన్నె సుబ్బారెడ్డి, నాయకులు గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, ఎస్ఏ గఫూర్, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, వెలగటూరు ధనుంజయయుడు, కంపమల్ల సుబ్బారెడ్డి, ఎంపీడీవో వర ప్రసాదరావు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దనరెడ్డి

రైతు సంక్షేమానికి సీఎం కృషి: ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ద్వారా చెరులకు నీరందించడం చారిత్రకం అని, రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని హుసేనాపురం చెరువును శనివారం ఆయన పరిశీలించారు. కోట్ల మాట్లాడుతూ కరువు సీమలో చెరువలకు నీరందించి రైతుల కళ్లలో ఆనందం చూడలన్నదే సీఎం ధ్యేయమన్నారు. అందువల్లే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధిగమించి చెరువలకు నీరందించామన్నారు. చెరువులకు నీరు నింపడం వల్లభూగర్భ జలాలు పెరిగి మంచి పంట దిగుబడులు వస్తాయన్నారు. నియోజవర్గంలోని దాదాపు అన్ని చెరువులకు నీరందించామని ఆయన తెలిపారు. అంతకు ముందుగా ఆయన మండలంలోని సిద్దనగట్టు గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వై.లక్ష్మీనారాయణ యాదవ్, టి.శ్రీనివాసులు, ఖాజాపీర్, అలేబాదు పరమేష్, సుదర్శన్, ఆర్ఈ శ్రీకాంత్, ఆర్ఈ నాగరాజు, కుమ్మరి సుధాకర్, తిమ్మారెడ్డి, ప్రసాద్, కేసీ మద్దిలేటి, దామోదర్‌నాయుడు, రమణగౌడు, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుసేనాపురం చెరువును పరిశీలిస్తున్న కోట్ల

పట్టుదలతో శ్రమిస్తే విజయం ఖాయం



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


బనగానపల్లె, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో క్రమశిక్షణతో విద్యార్థులు శ్రమించి, కష్టపడి చదివితే విజయం సాధ్యమని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శనివారం పట్టంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీసీ రాజారెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల జీవితం ఎంతో విలువైందన్నారు. ఈ సమయంలో తప్పటడుగు వేయకుండా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. 10నుంచి 25 ఏళ్ల వయస్సులోపు మనం తీసుకునే సరైన నిర్ణయాలే మన వందేళ్ల భవిష్యత్‌కు పునాది అన్నారు. ప్రతి ఒక్కరికి స్నేహితులు అవసరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదివిస్తుంటారని వారి ఆశలను వమ్ము చేయకుండా ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలన్నారు. కళాశాల అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు, భానుముక్కల సహకార సంఘం చైర్మన్ అబ్దుల్ కలాం, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం

బనగానపల్లె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని పురస్కరించుకొని బ్రహ్మంగారి కాలజ్ఞాన విశిష్టతపై సదస్సు నిర్వహించారు. బ్రహ్మంగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మంగారు బనగానపల్లె ప్రాంతంలో నివసించడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. బనగానపల్లెలోని నేలమఠం, చింతమాను మఠం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సమావేశంలో పూజారి శ్రీనివాసులు, రామయ్యాచారి, లక్ష్మన్న, బాలన్న, ఆంజనేయులు, కరెంట్ రాజు, బ్రహ్మంగారి భక్తబృందం పాల్గొన్నారు.

ఘనంగా కోట్ల సుజాతమ్మ జన్మదిన వేడుకలు

బేతంచెర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ 59వ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకుడు శివ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి ఘనంగా నిర్వహించారు. బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్లు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీల్ కుమర్ డాక్టర్ స్వప్న ప్రియ డా.విజయభాస్కర్‌తో పాటు టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. అలాగే నంద్యాల రహదారిలో ఉన్న అన్నపూర్ణ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు శివ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవకృష్ణ, జనసేన నాయకులు శ్రీకంటి మధు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

డోన్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. పట్టనంలోని టీచర్స్ కాలనీలో శనివారం చౌక దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తూకాల్లో తేడా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, తహసీల్దార్ రవికుమార్, సీఐ ఇంతియాజ్ బాషా, మర్రి రమణ, లక్ష్మీనారాయణ యాదవ్, రమణయ్య, గోవింద రెడ్డి, ధను, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ షాపును ప్రారంభిస్తున్న కోట్ల

గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

కొలిమిగుండ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ గుండం ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండవ శనివారం సందర్భంగా వైభవంగా పూజలు నిర్వహించారు. గౌడ్స్ సంఘం ఆధ్వర్యంలో వన భోజనం కార్యక్రమం నిర్వహించి స్వామి వారికి ప్రీతికరమైన ఆకుపూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

పింఛన్ పంపిణీపై లబ్ధిదారుల్లో సంతృప్తి

కొలిమిగుండ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం అధిక మొత్తంలో ప్రతి నెలా 1న పింఛన్ పంపిణీ చేయడం పై లబ్ధిదారుల్లో ఎంతో సంతృప్తి కనిపిస్తోందని హనుమంతుగుండం సొసైటీ చైర్మన్ మూల శివారెడ్డి, టీడీపీ ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి అన్నారు. శనివారం కోటపాడు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు.

అధికారుల కారు బోల్తా

డోన్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా శనివారం అధికారులు వెళ్తున్న కారు బోల్తా పడింది. డోన్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ కారులో కామగానిగుంట్ల గ్రామానికి పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బయలుదేరారు. కారు కామగానిగుంట్ల ప్రధాన రోడ్డులో అదుపుతప్పి బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో అధికారులకు స్వల్ప గాయాలయ్యాయి.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

కొలిమిగుండ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామంలో గైని నరేంద్ర అనే వ్యక్తి దాడి జరిగింది. శనివారం సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సునీల్, వెంకటరాముడు, ముద్దులయ్య నరేంద్రపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

బేతంచెర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే సహకార పరపతి సంఘం సొసైటీ లక్ష్యమని సొసైటీ చైర్మన్ చంద్రశేకర్ అన్నారు. శనివారం పట్టణంలోని సహకార పరపతి సంఘం కార్యాలయం ఆవరణంలో నాబార్డు సౌజన్యంతో ఎఫ్ఐఎఫ్ వారి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సొసైటీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, డైరెక్టర్ రాధాకృష్ణ, హనుమంతరెడ్డి, మండల సీఈవో ఓబులేసు, రిసోర్స్ పర్సన్ కొమ్ముపాలం శ్రీనివాస్ పాల్గొన్నారు. చైర్మన్ మాట్లడుతూ రైతులకు ఉత్పత్తి ప్రాసెసింగ్ అవసరాల కోసం రాయితీలు, రైతులకు రుణాలు ఆర్థిక సాయం కల్పిస్తుందన్నారు.

పంటల పరిశీలన

కోవెలకుంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవనూరు, లింగాల గ్రామాల్లో పొలాలను కోవెలకుంట్ల హార్టికల్చర్ అధికారి శ్రీధర్ బృందం పరిశీలించింది. దెబ్బతిన్న మిరప పంటను శనివారం శాస్త్రవేత్తలు డాక్టర్ రాఘూర్‌నాయక్, డాక్టర్ హేమాద్రి పరిశీలించారు.

మెనూ పాటించాలి

కోవెలకుంట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం హాస్టల్ విద్యార్థులకు భోజనాలు వడ్డించాలని డోన్ డివిజన్ బీసీ సంక్షేమ సహాయాధికారి ఓబులేసు ఆదేశించారు. శనివారం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. హాస్టల్‌లో 119 మందికి గాను కేవలం 30 మంది ఉన్నట్లు గుర్తించారు. మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

సంజామల,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముదిగేడు ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని తహసీల్దారు అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ తనిఖీ చేశారు. వంట గది వద్ద నీరు నిల్వ ఉండటంతో ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులతో మాట్లాడారు.

చెస్ పోటీలకు ఎంపిక

ఉయ్యాలవాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడెమ్మనూరు గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థి జి. మహేంద్ర జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శరభారెడి తెలిపారు. నంద్యాలలో జరిగిన డివిజన్ స్థాయి అండర్ 14 చెస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటినట్లు తెలిపారు.

'లక్ష్యాన్ని అధిగమించాలి'

చాగలమర్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ పథక లక్ష్యాన్ని అధిగమించాలని వయోజన విద్య జిల్లా సూపర్‌వైజర్ ఆదినరసింహ తెలిపారు. శనివారం చాగలమర్రి వెలుగు కార్యాలయంలో ఏపీఎం నాగమ్మ ఆధ్వర్యంలో వలంటీర్ టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వాచకాలను పంపిణీ చేశారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

శిరివెళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో మనిషి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జనార్దనుడు అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ కన్వీనర్ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం

శిరివెళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగా కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

చాగలమర్రి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వెల్లాల క్షేత్రంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభివృద్ధికి ప్యాపిలి మండలం జలదుర్గం నారాయణ దంపతులు రూ.లక్ష విరాళం అందించారు.